ఉన్నదాంట్లో
తృప్తి పడక
పుట్టింటికి వచ్చిన
ఆమెకి
కలిగిన కనువిప్పు!

# మనసున మనసై

## గెల్లి మహేశ్వరి కథ

తెలతెలవారుతుండగా సుభద్ర సిమెంట్ తొట్టెలనిండా బిందెలనిండా అన్నింటిలో మా నిండుగా నీళ్లు పట్టేసి అలుపు తీర్చుకోవడానికన్నట్లు అక్కడే నూతి గట్టు మీద కూర్చుంది.

"ఒసేయ్ సుభద్రా నువ్వు నీళ్లు తోడడం అయిందటే. లేకుంటే మెల్లగా ఆటలాడుకుంటూ చేస్తున్నావా... ఇక్కడ పొయ్యి దగ్గర ఒక్కదాన్నీ ఛస్తున్నాను తమ్ముకువి తొందరగా రావే..." అంటూ మాణిక్యాంబ అరుస్తోంది.

తల్లి మాటలు వినిపిస్తున్నా సుభద్రకెందుకో వెళ్లబుద్ధి కాక అక్కడే కూర్చుంది. అప్పుడే అటుగా వచ్చిన పరశురామయ్యగారు పరాగ్గా వున్న కూతుర్ని చూసి "మీ అమ్మ ఒక్కతే అతలాకుతలమై ఛస్తుంటే ఇక్కడ తీరిగ్గా కూర్చున్నావా తల్లీ వెళ్లి మీ అమ్మకు పనందుకో, అనక తీరిగ్గా ఆలోచిస్తూ కూర్చుందువుగానీ చేసేదేం వుందీ..." కసిరినట్లే అన్నాడాయన.

మనసులో తండ్రిమాటలకొళ్లు మండిపోతున్నా చచ్చినట్లు లేచి తల్లిదగ్గరకు వెళ్లింది సుభద్ర.

"నీళ్లు తోడడం ఎంతసేపే తల్లీ ప్రొద్దున సమయాల్లో ఎంత ఊపిరాడని పని వుంటుందో నీకు తెలియదూ... ఏవిటో ఈ మధ్య ఏ పని చెప్తే అక్కడ కూర్చుండిపోతున్నావు. కావాలని చేస్తున్నావో ఏమిటో" అంటూ కూరలు తెచ్చి సుభద్రముందు పడేసింది తరగమని. అవి తరగడం పూర్తి కావస్తుంటే మళ్లీ మాణిక్యాంబే అన్నది.

"అవి తరగడమయిన తరువాత కరివేపా



కు, మిరపకాయలు వేయించి పెట్టానుగానీ అవి తీసుకువెళ్లి కారం నూరుకురావే. సీనుగాడికదంటే ప్రాణం. ఆ చేత్తోనే కాస్త శనగపప్పుకూడా పొడుంకొట్టి తీసుకురా, అది లేందే మీ నాన్న ముద్ద ఎత్తరు. తొందరగా పని పూర్తిచెయ్యి. ఇక రోటి దగ్గరే కూర్చోకు'' పురమాయించింది కూతురికి. విసుగనిపించినా తప్పదు కాబట్టి పని

పూర్తిచేసుకువచ్చింది సుభద్ర.

''అక్కా నా స్కూల్ డ్రెస్ ఉతికావా'' అంటూ వచ్చింది చెల్లెలు సుమిత్ర.

''నా షర్టుకు బొత్తాలూడిపోయాయనీ, కుట్టమనీ నిన్ననే చెప్పాను కుట్టావా'' తమ్ముడు సీను అడిగాడు.

''మర్చిపోయాము'' కావాలనే అంది సుభద్ర.

''డ్రెస్ వేసుకోకుండా స్కూలుకెళ్తే మా మిస్ కోప్పడుతుందంటూ సుమిత్ర ఏడుపు మొదలుపెట్టింది. ''నా షర్టుకు బొత్తాలు కుట్టకపోతే నేను స్కూలుకెళా వెళ్తానూ... మానేస్తాను''

''బడుద్దాయిల్లారా పరీక్షలు దగ్గరకు వస్తుంటే స్కూలుకు వెళ్లకపోతే పాఠాలెలా తెలుస్తాయి. వెళ్లకపోతే వీపులు చీరేస్తాను. అయినా నువ్వు చేసే పనేముందే సుబ్బీ వాళ్ల పనులయినా చెయ్యరాదూ....'' సుభద్రవేపు కోపంగా చూస్తూ అన్నారు పరశురామయ్యగారు.

''చేసే పనేమీ లేదంటూనే అస్తమానం పనులు పురమాయిస్తున్నారు. సుమిత్రకు పన్నెండేళ్లొచ్చాయి. తన బట్టలు తను ఉతుక్కోలేదా? సీనుకు పధ్నాలుగేళ్లు వచ్చాయి. ఆ మాత్రం బొత్తాములు కుట్టుకోలేడా? అన్నీ నేనే చెయ్యాలా...'' కొంచెం విసురుగానే అంది సుభద్ర.

''నోర్ముయ్... తిని కూర్చుని తిక్కరేగుతున్నట్లుందే... వాళ్లింకా చిన్న పిల్లలు. అదీకాక చదువుకుని వచ్చి ఇంకా ఈ పనులెక్కడ చేస్తారూ, చేస్తే నీ వొళ్లేం కరిగిపోదులే. ఒకవేళ కరిగినా కాస్త నాజూకు తేల్తావు'' అని కసిరింది మాణిక్యాంబ.

సుభద్రకాళ్లుమండిపోయి అక్కణ్నుంచి తటాలున లేచి దొడ్లో ఓ మూలగా వున్న బాదం చెట్టుకింద కూర్చోవడానికి వెళ్లిపోతుంటే వెనుకనుంచి తండ్రి మాటలు విన్పించాయి. ''దీనికి తిని కూర్చుని వొళ్లు పెరిగిపోతుంటే ఇంకా అంతా తనే చేసినట్లు నీలుగుతుంది.''

ఆ మాటలువిన్నాక కళ్ల నీళ్లు చిమ్మాయి సుభద్రకు. అక్కడ్నుంచి గబగబా వెళ్లిపోయింది. ఆమెకెప్పుడు మనసు బాగోకపోయినా వెళ్లి అక్కడే కూర్చుంటుంది.

తన అతి తెలివితేటలతో ఎంత మూర్ఖంగా ప్రవర్తించిందో, ఎంత అనాలోచితంగా పుట్టింటికి వచ్చేసిందో ఇప్పుడు తెలిసివస్తోంది. ఇప్పుడు వెళ్లగలదా? పోనీ అభిమానం చంపుకుని వెళ్లినా మునుపటిలా అత్తవారింట్లో ఆదరణ లభిస్తుందా? ముఖ్యంగా సత్యం తనని ప్రేమగా పలకరిస్తాడా? లేక సిగ్గులేదాని ముఖంమీదే అడుగుతాడా? ఇలా అనిపించగానే భర్త సత్యం, అత్తగారు యశోదమ్మ గుర్తుకొచ్చారు సుభద్రకు. అక్కడే గడిచిన సంగతులన్నీ నెమరువేసుకుంటూ కూర్చుంది.

సత్యం వో ఫ్యాన్సీ షాపులో పనిచేస్తాడు. జీతం నాలుగు వందలిస్తారు. అతనికి తల్లి తప్ప చెప్పుకోగలిగినవాళ్లెవరూ లేరు. వుండడానికో చిన్న పెంకుటిల్లుంది. అందులో రెండే గదులు. ముందు వసారా వుంటుంది. ఒక గది వంటిల్లుగా చేసి మరో గది కొడుకు కోడలికిచ్చి తను ముందు వసారాలో పడుకు

ంటుంది యశోదమ్మ.

జీతంలో కొద్దిమాత్రం తన ఖర్చులకుంచుకుని మిగతాది తల్లికే ఇచ్చేస్తాడు సత్యం. ఎందుకంటే అతనికి తల్లంటే అభిమానం, గౌరవం వున్నాయి.

అతని చిన్నప్పుడే తండ్రి పోయాడు. అసలాయన ముఖమే తను ఎరుగడు. కానీ అప్పుడు జరిగిన విషయాలు తను పెద్దయ్యాక తల్లి చెప్పగా విన్నాడు. భర్త పోగానే యశోదమ్మను కొంతమంది బంధువులు ఆమెను వచ్చి తమ ఇంట్లో వుండమని చెప్పారు. కానీ దూరదృష్టిగల యశోదమ్మ ఏదో సాకుచెప్పి వున్న ఒక్కగానొక్క బిడ్డను చూసుకుంటూ తనింట్లోనే బ్రతుకు సాగించింది.

ఉన్న రెండు గదుల్లో ఒక్క గది మాత్రమే తనుంచుకుని రెండవ గది అద్దెకిచ్చి దొడ్లో వున్న కొద్ది మట్టి జాగాలో అరటి పిలకలు తెచ్చి నాటింది. అప్పటికే అక్కడ నాలుగైదు కొబ్బరి చెట్లున్నాయి. కొబ్బరి బోండాలు కోయించినప్పుడల్లా వాటికున్న పీచుతీసి ఎండబెట్టి కొబ్బరికాయలతో పాటు అమ్మి డబ్బు సంపాదించేది. కొబ్బరి ఈనెల్నుంచి పుల్లలు తీసి చీపుళ్లుకట్టి కిరాణా కొట్లలో అమ్మేది. రాలిన మట్టలను వంటకు వేణ్ణీళ్ల కాయడానికి ఉపయోగించేది. అలాగే అరటిచెట్లకు వేసిన గెలలు తయారైనాక తీసుకువెళ్లి పళ్లకొట్లలో అమ్మేది.

ఆ విధంగా కష్టపడి పైసపైస పొదుపుగా ఖర్చుచేస్తూ కొడుకును పెంచింది. ఎందుకవో సత్యానికి పెద్దగా చదువబ్బలేదు. అందుకే షాపులో చేర్పించింది. పెద్దవాడయ్యాక సుభద్రతో పెళ్లిచేసింది. పెళ్లి కాకముందు జీతం రాగానే మొత్తం తల్లికిచ్చేసేవాడు సత్యం. తల్లి తన ఖర్చులకెంతిస్తే అంతే ఖర్చుపెట్టుకునేవాడు. అతనికే దురలవాట్లూ లేకపోవడంచేత ఇంకే ఆలోచనలు రావు.

**పెళ్లి**

పవన్ అన్నాడు.
"ఇహ నాకీ జన్మలో పెళ్ళికాదు"
"ఏం?" అడిగాడు సుమన్.
"ఒకసారి అయ్యిందిగా..." చెప్పాడు పవన్.
- బి.వి.ఎస్. బాబు. (తెనాలి)



ఆ అలవాటు ప్రకారమే పెళ్లయిన తరువాతకూడా తల్లికే మొత్తం జీతం ఇచ్చేసేవాడు. తల్లికూడా అతని అవసరాలు పెరుగుతాయని గ్రహించిందేమో అందులో సగం కొడుక్కే ఇచ్చేసేది. ఇది సుభద్రకు కన్నెర్రగా వుండేది. ఇదివరకు సంగతెలా వున్నా ఇప్పుడు జీతమంతా తెచ్చి భర్త తన చేతుల్లో పోస్తాడని ఊహించిన సుభద్రకు భర్తమీద కసిరేగేది.

"అంతా మీ అమ్మ చేతికిస్తే నా ఖర్చుకెవరిస్తారని రాత్రిళ్లు భర్తతో పోట్లాడేది. "కావాలంటే అమ్మనడిగి తీసుకో సుభా" అనేవాడు సత్యం.

"టాట్... నా భర్త సంపాదించి తెస్తున్నప్పుడు నేనెందుకామెనడుక్కోవాలీ... పావలా మల్లెపూలు కావాలన్నా ఆమెనడుక్కోవాలా, నాకంత ఖర్మ పట్టలేదు" అనేది కోపంగా తను.

"ముందు మా అమ్మకు కొడుకునయ్యాకే నీకు భర్తనయ్యాను. నిన్నగాక మొన్న నువ్వొచ్చావని ఎన్ని కష్టాలో పడి పెంచిన మా అమ్మను విదిలించెయ్యాలా, ఏం మీ అమ్మనడగవా... మా అమ్మనడిగి తీసుకుంటే తప్పేముందీ..." అనేవాడు.

"అత్త అమ్మవుతుందా" అని తనంటే "అది మనమేర్పరచుకునే అభిప్రాయాన్నిబట్టి వుంటుంది" అనేవాడు.

"హా... సిగ్గులేకపోతే సరి. అసలు భార్యకంటూ వేరే ఇవ్వాలని తెలియదా" అని తను రెట్టించేది.

సత్యం భార్యను దగ్గరకు తీసుకుని ఏదో చెప్పబోయేవాడు. సుభద్ర విదిలించేది. సత్యం ఆలోచిస్తూ పడుకునేవాడు. సుభద్ర భర్తనర్థం చేసుకోవడానికిష్టపడేదికాదు. ప్రయత్నించేదికాదు. పైగా అత్తగారంటే ఉక్రోషం పెంచుకోసాగింది. తన భర్తను తన గుప్పెట్లో పెట్టుకుని తెచ్చే జీతమంతా తన వొళ్లోనే పోసుకుంటుందా... తనేనా తీసిపోయిందీ... ఎన్నాళ్లావిడ పెత్తనమో తనూ చూస్తుంది. ఇలా సాగిపోయేవి సుభద్ర ఆలోచనలు.

అత్తగారికి ఒక్క పనిలో సాయపడేదికాదు. కావాలని తప్పించుకు తిరిగేది. అయినా యశోదమ్మ కోడల్ని పల్లెత్తు మాటనేదికాదు. తనే మెల్లగా చేసుకుపోయేది. ఇదంతా గమనించిన చంద్రం తల్లితో అనేవాడు. "పనంతా నువ్వొక్కదానివే చేసుకోకపోతే సుభద్రను పిలువకూడదా" అనేవాడు.

"ఏమంత పనిరా ఎంతమందున్నామనీ" అని కొట్టిపారేసేది. అది విని తనకు సంతోషం కలిగేబదులు ఒళ్లు మండేది. కొడుక్కి మెత్తగా మాటలు చెప్పి డబ్బంతా గుంజుకుంటుందనిపించేది తనకు.

ఒకసారి సత్యం ఇంటికి వస్తూ తనకోసం మల్లెపూలు తెచ్చి తనచేతికివ్వబోయాడు. తను అవి పుచ్చుకోకుండా విసిరికొట్టింది. "ఆడవాళ్లు పూలను విసిరికొట్టొచ్చా?" అంటూ ఆ పూలు మాలనపురూపంగా తీసుకువచ్చి తన జడలో తరుమబోతే తను విసురుగా "అబ్బో ఇన్నాళ్లకీ మొగుడు అర్ధరూపాయి పూలుతెచ్చి ఘనకార్యం చేశాడనీ" అని గేలిచేసి ఇంకా ఏవేవో మాటలు దులిపింది. అందుకు సత్యానికి కోపమే

వచ్చిందో బాధే కలిగిందో ఆ రాత్రి తననసలు దగ్గరకు తీసుకోకుండా మరో వైపుకు తిరిగి పడుకున్నాడు. అది తనకు మరీ వొళ్లు మండించింది.

ఇంకా అతను తనని లాలిస్తాడనీ, ప్రతి మారి ప్రసన్నురాలిని చేసుకుంటాడని ఎదురుచూసిన సుభద్ర ఆ రాత్రంతా లోలోపల నిప్పులు కక్కుతూనే పడుకుంది.

రుసరుసలాడ్తూనే భర్తతో కాపురం చేస్తోంది సుభద్ర. అప్పుడే పక్కింటి సరోజ 'టి.వి.' కొనుక్కున్నట్లు తెలిసింది సుభద్రకు.

ఆరోజునుంచి టెంపరరీగా కోపాన్ని అణచుకుని విదానంగా మాట్లాడుతూ కొద్ది రోజులాగి పడకగదిలో మెల్లగా తన కోర్కెను బయటపెటింది. "ఏవండీ మనంకూడా 'టి.వి' కొనుక్కుందామండీ" గారాలుపోతూ అతని చెంపలు మీటింది.

"ఇందుకా రాణిగారు అందంగా అలంకరించుకుని మరీ దగ్గరకు చేరారు. ఇంకా బుద్ధి మారిందేమో అనుకున్నాను. నిన్నిలా చూడంగానే ఆశ్చర్యం కలిగిందిలే.


"చాల్లెండి రోజూ మీకు దూరంగా వుంటున్నానా"

"ఆ వస్తావు. ఎలా నా అంతట నేనే దగ్గరకు తీసుకుంటేనేగా, నీ అంతట నీవు నా దగ్గరకొస్తున్నావా ఈ మధ్య. ఎంతసేపూ అదికావాలనీ, ఇది కావాలనీ, అవి లేవనీ, ఇవిలేవనీ రుసరుసలు, బుసబుసలేగా...

"పోనిండి ఆ గొడవ ఇప్పుడెందుకు? ఎలాగైనా టి.వి కొందామండీ ఎంచక్కా అన్ని భాషల సినిమాలు చూడొచ్చు, కొంటారుకదూ..."

"నీకసలు బుర్ర వుందా — మనమెంత మన తాహతెంత, మన స్తోమతనుబట్టి కోరికలుండాలి. అదేమైనా వందకూ రెండొందలకు వచ్చేదా... ఎంత తేలిగ్గా అడిగేశావు.

## రజనీ హిట్స్



రజనీకాంత్ నటించే ప్రతి చిత్రంలో తనదైన ఓ ప్రత్యేకత (మెస్మరిజం) పెట్టుకుంటాడు. ఇటీవల రజనీకాంత్ నటించిన అనేక చిత్రాలు తెలుగులోకి డబ్ అయి రిలీజ్ అవుతున్నాయి. హిట్ అవుతున్నాయి. భాషా ఎంత సక్సెస్ అయిందో అందరికీ తెలుసు. అలానే పెద్దరాయుడు చిత్రంలో కన్పించిన కొద్దిసేపు అయినా రజనీకాంత్ తనదైన స్టైల్ చూపించి శెభాష్ అనిపించుకున్నాడు. తొలుత కె.బాలచందర్ ద్వారా తెలుగు చలనచిత్ర రంగానికి పరిచయం అయినా, మన తెలుగు వారు రజనీకాంత్‌ని ఆదరించలేదనే చెప్పాలి!

**సుబ్బారావు**

ఆలోచమండొద్దూ...

"ఆ సరోజా వాళ్లేం షావుకార్లా... మనలాంటివాళ్లేగా వాళ్లు కొనుక్కోలేదూ. సరదా వుండాలిగానీ...'

"మన స్థితికి మించిన సరదాలొద్దంటున్నాను. పోనీ ఎప్పుడైనా సరోజగారింటికి వెళ్లి చూస్తే చాలదా — ఇప్పుడంత డబ్బుపోసి కొనకపోతేనేం?

"సరోజావాళ్లు ఇన్‌స్టాల్‌మెంట్ మీద కొన్నారు. మనంకూడా అలా కొనుక్కుంటే తేలికేగా.

"ఎంత తేలికగా చెప్పావు. నాకొచ్చే జీతం దానికోసమే ఖర్చుపెడ్తే ఇంటి ఖర్చెలా సుభా.

"మీ తెలివి తెల్లారినట్టే వుంది. ఇన్నాళ్ల నుంచి మీ అమ్మ వాళ్లోనే పోస్తున్నారుగా అదంతా ఏం చేస్తుందీ... మీ సొమ్ము మీరడిగి తీసుకోవడానికీ, ఖర్చుపెట్టుకోవడానికీ గుంజాటన పడ్తారు దేనికి?

"బాగుండదు సుభా... అమ్మతోకూడా ఒక్క మాట చెప్పి..."

"సరిసరి ఆమె బాబుగాడి ముల్లేమైనా పెడ్తోందా, లేక అంతా కట్టుకుపోతుందా?"

"మాటలు తిన్నగారానీ, పెద్ద చిన్న వుండక్కర్లా మా అమ్మ వింటే బాధపడదూ"

"ఎంతసేపూ అమ్మ అమ్మ ఆవిడలోనే ఊరేగరాదూ. పెళ్లామెందుకు?

"పోనీకదాని ఊరుకుంటుంటే అడ్డు ఆపు లేకుండా పేలుతున్నావు. నోటని కాస్త అదుపులో పెడ్తే సుఖపడ్తావు.

"ఆహా... ఇప్పుడీ మగాడితో సుఖపడి ఛస్తున్నానుగనుకా ఓ ముద్దులేదు ముచ్చట లేదు" ముక్కు ఎగబీల్చింది సుభద్ర.

"ఏం తీపరమొచ్చిందీ కాలు కదపకుండా కూర్చుని మేస్తున్నావుగా ఇంతకంటే సుఖమింకేం కావాలీ"

"అమ్మో అమ్మో... భార్య సుఖపడ్తుంటే ఏడ్చే భర్తను మిమ్మల్నే చూస్తున్నాను."

"నోరు మూస్తావా, కోటా ఇమ్మంటావా... ఆ మధ్య టేప్ రికార్డరన్నావు. ఈ వేళ టి.వి అంటున్నావు. ముందు ముందు ఫ్రిజ్ కావాలంటావు. మనసు నదుపులో పెట్టుకోకపోతే ఇల్లు గుల్లయిపోతుంది. ఇలాంటి గొంతెమ్మ కోర్కెలు పెంచుకుంటే ఎంత జీతాలైనా ఎలా చాల్తాయి.

"ఎలాగోలా సమకూర్చుకోవాలిగానీ, అసలిలాంటి పీనాసి రకమని తెలిస్తే..."

"ఊ తెలిస్తే..."

"పర్లేండి నాకెందుకొచ్చిన గొడవ, నా ఖర్మకాలి కట్టుకున్నాను. నేరకపోయి అడిగాను. అంతా మీ తల్లీ కొడుకులే దాచుకుని కట్టకట్టుకుని ఛా..." ఆమె వాక్యం పూర్తికాకముందే అతని బలమైన వేళ్లు సుభద్ర చెంపలను చురుక్కుమనిపించాయి. భర్త వైపు తీవ్రంగా చూసింది.

సత్యం మరింత తీవ్రంగా చూస్తూ "జాగ్రత్త వాళ్లు దగ్గర పెట్టుకో. అపురూపంగా నా గుండెల్లో వొదిగిపోతావో, పెడసరంగా ప్రవర్తించి దూరంగా మిగిలిపోతావో ఆలోచించుకో. ఇంకోసారిలా మాట్లాడితే మన్నించేది లేదు" అన్నాడు కోపంగా.

సుభద్ర చాపవేసుకుని పడుకుంది. అతను పిలవలేదు. శుభ్రంగా నిండా ముసుగుపెట్టుకుని పడుకున్నాడు.

తెలతెలవారుతుండగా తల్లి మాటలు విన్పించి మెలకువొచ్చింది సత్యానికి. యశోదమ్మ కోడలిని బ్రతిమాలుతోంది.


"ఆడదానికి పెళ్లయ్యాక అత్తింట్లోనే స్థానమమ్మా, నా మాట విను, భార్యాభర్తలన్నాక ఏవో మాట తేడాలు రాకుండా వుంటాయా, అంతంత ఖరీదైన వస్తువులు నిదానంగా ఆలోచించి కొనాలమ్మా" అంటోంది తల్లి.

"ఆయనొప్పుకుంటే మాత్రం మీరు పడనిస్తారా, అయినా దూరంగా వుండమని ఆయనే చెప్పారుగా. వద్దన్నా మీరే దిక్కనే ఖర్మ నాకేం పట్టలేదు" అంటూనే అత్తగారెంత బ్రతిమాలుతున్నా, అప్పటికే అక్కడకు వచ్చిన సత్యం ఏదో చెప్పబోతున్నా లెక్కచేయకుండా వచ్చేసింది.

ఉత్తరం, పత్తరం లేకుండా రిక్షా దిగిన కూతుర్ని చూసి మాణిక్యాంబ, పరశురామయ్య ముందు ఆశ్చర్యపోయినా తరువాత కూతురు చెప్పిందంతా విని కామ్‌గా ఊరుకున్నారు. సుభద్రను కొన్నాళ్లు ముద్దుగానే చూశారు. తరువాత మెల్లమెల్లగా తల్లి మాణిక్యాంబ చిన్న చిన్న పనులు పురమాయిస్తూ క్రమేణా ఇంటిపనంతా దాదాపు అప్పచెప్పేసి విశ్రాంతి పొందుతోంది.

అసలు సుభద్రకు పెళ్లికాకముందు కూడా తల్లికి సగం పనులు తనే చేసిపెట్టేది. అత్తగారింటికి వెళ్లింతరువాత అత్త యశోదమ్మకు మాత్రం రవ్వంత సాయం కూడా చేసేదికాదు. ఆడపిల్లలేని యశోదమ్మ కోడలిలో కూతుర్ని చూసుకున్నా తను మాత్రం అత్తలో తల్లిని చూడలేకపోయింది.

"ఏమేవ్... సుబ్బీ... ఆ బాదం చెట్టు దగ్గరేనా ఏడుస్తూంటు. బాదం చెట్టుకింద



కూర్చుంటే బాధలొస్తాయే!'' అని తల్లి కేకపెట్టేసరికి వాస్తవంలోకొచ్చిన సుభద్రకు అన్పించిందిలా... ఇప్పుడు బాధలు నేను చేతులారా తెచ్చుకున్నవేగా బాధం చెట్టం చేసిందీ...'' విసుగ్గా అనుకుంటూ లేచింది.

లోపలికి రావడంతోటే తల్లి ఎగాదిగా చూస్తూ ''ఏం తల్లీ గళం తవ్వుకోవడం పూర్తయిందా, ఇణదాకట్నించి పిల్లందరికీ అన్నాలు పెట్టి పూర్తయ్యేసరికి వేళయింది. అవన్నీ తీసి శుభ్రం చెయ్యి. అయినా తెలియకడుగుతానూ ఏదైనా ముందే బుద్ధి వుండాలిగానీ ఇప్పుడాలోచిస్తూ కూర్చుంటే ఏం లాభం వెళ్లు వెళ్లు'' వెక్కిరింతగా అందామె. సుభద్ర ముఖంలో కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు. తన ముఖంలోని భావాలు తల్లికి కనబడకుండా వుండడానికి గబగబా శుభ్రం చేసేసరికి తల్లి భోజనానికు పక్రమిస్తుంటే కళ్లనీళ్లు తిరిగాయి సుభద్రకు. తల్లి తనని భోజనానికి పిలువలేదు. తనకిందాకట్నించీ ఆకలి కరకరమంటూంది

ఎంత పనిచేసినా తల్లికి తృప్తి కలుగదు. తను ఊరికే కూర్చుంటే చూడలేదు. ఏ పని పురమాయిద్దామాని చూస్తుంది. ఇలా అనుకోగానే అత్త యశోదమ్మ గుర్తుకువచ్చి సుభద్ర మనసు బాధగా మూలిగింది. ఆమె యేనాడూ తనని సాధించలేదు. శాసించలేదు. ఒక్క పనికూడా తనకు చెప్పేదికాదు. ఒకవేళ దేనికైనా పిలిస్తే అమ్మాయ్ సుభద్రా అని పిలిచేది. తన తల్లి మాత్రం 'ఒసేయ్ సుబ్బీ' అంటూ అధ్వాన్నంగా పిలుస్తుంటే తనకు కంపరం పుడ్తోంది.

తను తెలిసో తెలియకో పుట్టింటికి వచ్చేసినా అది తప్పని చెప్పి తల్లో తండ్రో తనని అత్తవారింట్లో దిగబెట్టిరావచ్చుగా... ఉహూ.... తను వెళ్లిపోతే ఇంట్లో పనంతా ఎవరు చేస్తారు? అందుకే తన జీవితాన్ని గురించి పట్టించుకోవడంలేదు. ఎంత స్వార్థ పరులు, వీళ్లా కన్నవాళ్లు?

''ఇక్కడింత చాకిరీ చేస్తున్నా మెప్పుండదు. ఈ పనులు అత్తవారింట్లో చేస్తే తన భర్త, అత్తగారు ఎంత సంతోషించేవారు. అప్పుడు తనకెంత విలువ దక్కేది. అతి చిన్న విషయానికి ప్రాముఖ్యతనిచ్చి తన కాపురంలో తనే నిప్పులు పోసుకుంది సత్యం తనని నోరారా 'సుభా' అంటూ ప్రేమగా పిల్చినా అప్పుడు పొరలుకమ్మిన తన మనసుకు అతడి పిలుపులోని మాధుర్యం అందలేదు.

''ఏమ్మా మహాతల్లీ ఈవేళంతా అలా తోముతూనే వుంటావా? ఇవతల పడేదేమైనా వుందా'' అన్న తల్లికేక విన్పించి గబగబ చేస్తున్న పని పూర్తిచేసి వచ్చింది. ఇంతలో 'పోస్ట్' అన్న కేక విన్పించి వెళ్లి ఉత్తరాలు తీసుకుంది. అందులో తన పేరుతో వున్న కవరు చూసి ఆశ్చర్యంగా ఆత్రంగా తన కవరు మాత్రం తీసుకుని మిగతావి తండ్రి గదిలో టేబుల్ మీద పెట్టేసి బాదం చెట్టుదగ్గరకు వెళ్లి కవరు విప్పింది సుభద్ర!

''ప్రియమైన సుభా...

నీవు క్షేమముగా వున్నట్లు తలుస్తాను. నేను, అమ్మ క్షేమము. నీవు వెళ్లిన తరువాత

ఒక్క కార్డయినా రాయలేదేం? పోనీలే అక్కడ సంతోషంగా కాలం గడుపుతున్నావ నుకుంటాను. నీవు వెళ్లిన కొద్దిరోజులకు నేను నీకో లెటర్ వ్రాశాను. నీకు అందిన తో లేదో తెలియదు. రిప్లై మాత్రం రాలేదు. మన ఎదురింటి సత్యవతమ్మగారు మీ ఊరు వస్తుంటే నీవు ఇబ్బంది పడ్డావే మోనని కొద్ది డబ్బు ఆమెకిచ్చి పంపాను. అది నీవు అందుకున్నట్లు తలుస్తాను.

భార్యాభర్తలన్న తరువాత కోపతాపాలు, అలకలు సహజం. అది కొద్దిసేపయితే బాగుంటుంది. ఇంత చిన్న విషయానికి మనిద్దరం ఒకరికొకరం కాకుండా పోతామా. .. భార్యాభర్తల బంధం ఏడేడు జన్మలబంధ మంటారు. నీకసలు నేను గుర్తుకురావడంలేదా? నాకుమాత్రం రోజూ గుర్తుకువస్తావు. నేను చిన్నప్పటిమంచీ ఒంటరిగానే గడిపాను. అమ్మ తప్ప బంధువుల్నీ, స్నేహితుల్నీ కూడా పెద్దగ పెరుగను. అందుకే నీవు నా ఇంటికి వచ్చిన తరువాత వేయి దీపాల కాంతి వచ్చినట్లయనిపించిదరి. అప్పుడు నాకేమనిపించిందో తెలుసా..?

నా సర్వస్వం నీవనీ ఈ ప్రపంచంలో నన్ను కన్నతల్లి, నన్ను కట్టుకున్న భార్య నాకు చాలనిపించింది. మరి నువ్వో... మన మధ్యనున్న పవిత్ర బంధాన్ని, విలువైన జీవితంకంటే మనుషులకంటే ఒక చిన్న విషయానికి ప్రాముఖ్యతనిచ్చి వెళ్లిపోయాడవు.

నాకు జీతం పెరిగింది. మనింట్లో వంటకు కావాల్సిన సామాన్లు తప్ప చెప్పుకో దగిన సామానులేమీ లేవు. ముఖ్యంగా మనకవసరమైనవి అంటే మన గదిలో ఫ్యాను, చిన్న ట్రాన్సిస్టరు కొందామని నాకన్పించి, అమ్మతో అంటే సంతోషంగా ఒప్పుకుంది. మెల్లగా మనక్కావలసినవన్నీ ఏర్పరచుకుందాం సుభా... భార్యాభర్తలంటే మనసులో మనసై బ్రతకాలని నా అభిప్రా

## పోటీ

కవిత అంది సరితతో...

''నేను ప్రతి రోజూ మా ఇంట్లో మావారికి పిల్లలకు వంటకాల పోటీ పెడతాను''

''ఏ విధంగా...?''

''నేను చేసిన ప్రతి వంట రుచి చూసి దానిపేరు చెప్పాలి''

''మరి చెప్పేవారా?''

''ప్చ్! లేదు. ప్రతిసారీ గెలుపు నాదే...'', చెప్పింది గర్వంగా కవిత.

- బి.వి.ఎస్.బాబు (తెనాలి)



యం, అప్పుడేమీ లేకపోయినా, అన్నీ వున్నట్లేననిపిస్తుంది.

నాకు చిన్నప్పటినుంచీ మా అమ్మే తల్లీ, తండ్రీ, గురువు, దైవం, స్నేహితురాలు, ఆప్తురాలు కాబట్టి అన్నీ అమ్మతో సంప్రదించి చేయడం నాకలవాటు. ఏది చేసినా ఇంట్లో వున్నమవ ముగ్గురికీ సంతోషం కలిగించేదిగా వుండాలని నా ఆశ.

ఆ — అన్నట్లు మరిచాను. సరోజగారింట్లో 'టివి'కి ఇన్‌స్టాల్‌మెంట్స్ సరిగా కట్టకపోవడంతో షాపువాళ్లు వచ్చి టివి తీసుకు వెళ్లిపోయారు. చూశావా సుభా మనకొచ్చే రాబడి మించిన కోరికలు పెంచుకుంటే నవ్వులపాలవక తప్పదు. తోటివాడు తొడకోసుకుంటే మనం మెడకోసుకోవాలనుకుంటే ఎలా వుంటుందో చూశావా సుభా...

జీవితానికి భర్తకంటే వస్తువులే ముఖ్యమనుకుంటే ఇంక నేను చెప్పేదేమీ లేదు. నేను కావాలనుకుంటే మాత్రం రా... ఎప్పటికీ నీ కోసం ఎదురుచూస్తూనే వుంటాను. నీ స్థానమీ యింట్లో చెక్కుచెదరదు. నా మనసంతా నీవే నిండి వున్నా మాటల రూపంలో వ్యక్తపరచడంగానీ, వ్రాయడంగా నీ నాకంతగా చేతకాదు. ఈ లెటర్ అందాకయినా వస్తావని ఎదురుచూస్తాను. లేకుంటే కనీసం ఉత్తరమైనా వ్రాయి. నిన్ను చూసినట్లు తృప్తిపడ్తాను. వ్రాస్తావుకదూ...

ఎప్పటకీ

నీ సత్యం

చదవడం పూర్తయ్యేసరికి కళ్లనిండా నీళ్లు నిండుకున్నాయి సుభద్రకు. ఆ ఉత్తరాన్ని ప్రేమగా గుండెలకదుముకుంది. అక్కడ సత్యం ఏవో చిలిపి పనులు చేస్తున్న అనుభూతి కలిగింది.

"ఒసేయ్ సుబ్బీ నీకు తిండి తిప్పలు అక్కర్లేదేమిటే" తల్లి పిలుపుతో భారంగా కదిలింది. తల్లిదండ్రులమీద పట్టరాని కోపం వస్తోంది సుభద్రకు. తన భర్త వ్రాసిన లెటర్, అతను పంపిన డబ్బు తనకందనివ్వలేదనీ.

ఆ రాత్రి తల్లిదండ్రుల ముఖమ్మీదే ఆ విషయమడిగేస్తుంటే ముందు వాళ్లిద్దరిముఖాలు ఏదోలా అయిపోయినా వెంటనే కూతురిమీద విరుచుకుపడ్డారు.

"ఔనే. పంపాడు. అయితే నీకివ్వవలసిన పనేమిటే? నిన్ను మేపడానికెంతవుతోంది. అయినా ఆడపిల్ల అత్తవారింటికి పంపాక కష్టమైనా, సుఖమైనా అక్కడే పడుడాలి. వెధవ గొంతెమ్మ కోరికలు పెంచుకుని నీ కాపురం కూలదోసుకోమని మేం చెప్పామా. ..

"ఊరికే మేపుతున్నారా. చచ్చే చాకిరీ చేయించుకుంటున్నారు వాతో..." మొగుణ్ణి వదిలేసి వచ్చినవాళ్లు ఇక్కడ పనికూడా చెయ్యక మా నెత్తినెక్కడానికా పాపం నిన్ను వియ్యపురాలిలి కూర్చోపెట్టి మెక్కపెట్టడానికి మీ ఆయన పంపిన రాశులేమీ లేవు. నోర్మూసుకుని పడుండు" అని ఇద్దరూ హూంకరించడంతో సుభద్ర ముఖం తెల్లగా పాలిపోయింది.

చరచరా వెళ్లి తన మంచంమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది. వీళ్లకు తనెంత లోకువయిపోయిందీ... ఎక్కడుండవల్సినవా

ళ్లక్కడుంటేనే మర్యాద కాబోలు, వీళ్లేదో తనకు వొరగబెడ్డారనీ ఆకాశానికెత్తి అపురూపంగా చూస్తారనీ ఎంత పిచ్చిగా ఆలోచించిందీ... అక్కడ స్థానం పోగొట్టుకొచ్చావనీ చచ్చినట్లు చాకిరీ చెయ్యమనీ ఎంత స్పష్టంగా చెప్పారు.

తన భర్త తన స్థానం అలాగే వుందని వ్రాశాడు. నిజంగా వెళ్తే ఆదరిస్తాడా? తనకు తానుగా వెళ్తే చిన్నచూపు చూస్తాడా... వీళ్లు ఒప్పుకుంటారా? వీళ్లు ఒప్పుకనేదేమిటీ తనింటికి తను వెళ్తుంది. అంతలోనే తల్లి మాటలు విన్పించి చెవులు రిక్కించింది సుభద్ర.

''మన పక్కింటివారమ్మాయి కమలను చూడండీ లక్షణంగా కాపురం చేసుకుంటోంది. ఇంకా ఆ అమ్మాయి మొగుడు మంచివాడు కాదటకూడానూ. సత్యం బుద్ధిమంతుడు. భర్తమనసెరిగి మసలుకోవద్దూ. దీని గొంతెమ్మ కోరికలూ ఇదీనూ. ఛీ పాపిష్టిపిల్ల. ఇట్లా తయారు చేసిందేవిటీ అని అందరూ నవ్వాడిపోసుకుంటారు'' అంటూ తండ్రికి చెప్తోంది.

అంతే వీళ్ల మనసుల్లో తనంటే దురభిప్రాయం వున్నట్లేకదా. తనిన్నాళ్లు గ్రహించలేకపోయింది. ఇంకా ఇన్నాళ్లు తనను సమర్థించినట్లేననుకుంది.

ఇలా ఆ రోజంతా ఆలోచిస్తూనే వుంది సుభద్ర. మర్నాడు సుభద్ర తన పెట్టె బేడా సర్దుకుని తల్లిదండ్రులతో చెప్తోంటే మాణిక్యాంబ, పరశురామయ్య ముఖాలు చూసుకున్నారు.

సుభద్ర రిక్షా ఎక్కబోతుంటే తల్లి ఏదో పొట్లాం చేతికిచ్చింది. తండ్రి ఏదో కవరు చేతిలో పెట్టాడు.

సుభద్ర బస్సు ఎక్కిన తరువాత తండ్రి ఇచ్చిన కవరును విప్పింది. వెంటనే అందులో వున్న అక్షరాలవైపు ఆమెచూపులు

## రెబల్‌స్టార్ చిత్రం



రెబల్‌స్టార్ కృష్ణంరాజు 'చిలకా గోరింకా' చిత్రంద్వారా హీరోగా తెలుగు చలనచిత్రరంగానికి పరిచయం అయినా, ఆ తరువాత మనఊరి పాండవులు, బొబ్బిలి బ్రహ్మన్న మొన్నటి బావ-బావమరిది చిత్రంవరకు తన ప్రత్యేక శైలిలోనే నటిస్తూ తన ఇమేజ్‌ని పెంచుకుంటూ వస్తున్నారు. తనకు నచ్చని చిత్రాలు - కథలు నచ్చకపోతే తన గ్రానైట్స్ బిజినెస్ చేసుకుంటున్నారేగాని, అవకాశం వచ్చిందని నటించడంలేదు. ''లీడర్, సింహగర్జన, ఇటీవల నటించాను. ప్రస్తుతం ధ్వని ప్రతిధ్వని నటిస్తున్నాను. నా స్వంత బ్యానర్ మరలా పునఃప్రారంభిస్తున్నాను. వివరాలు త్వరలో తెలియజేస్తాను'' అని ఇటీవల కలిసినప్పుడు హీరో కృష్ణంరాజు తెలియజేశారు.

సుబ్బారావు

పరుగుపెట్టాయి.

"అమ్మా... సుభద్రా!

ఈరోజు మాకెంత సంతోషంగా వుందో చెప్పలేము. నీపట్ల నేను, మీ అమ్మ కాస్త కటువుగా ప్రవర్తించినందుకు నీకు మామీద పీకలవరకు కోపముందని తెలుసు కానీ నీ కాపురం చక్కబడాలనీ, నీలో పరివర్తన రావాలనే మేమలా కఠినంగా ప్రవర్తించవల్సి వచ్చింది.

ఏ తల్లిదండ్రులైనా ఆడపిల్లకు పెళ్లిచేసి ఆమె అత్తవారింట్లో లక్షణంగా కాపురం చేస్తుంటే చూడాలనుకుంటారు. అంతేకాని వెర్రిమొర్రి ఆలోచనలతో మొగుడితో పోట్లాడివస్తే సమర్థించి ఇంట్లో కూర్చోబెట్టుకునేట్లయితే అసలు ఆడపిల్లకు పెళిల్చేయడమే అనవసరమేమో. నీకంత చెప్పలేనంత కష్టమొస్తే నా ఇంట్లో ఎప్పటికీ నీకు పుట్టినిల్లుగా స్థానముంటుంది.

సత్యం యోగ్యుడు. అతని స్థితిగతులర్థం చేసుకుని మసలుకోవడం నీకు మంచిది. ఎప్పుడూ తెలివితక్కువగా ఆలోచించి నీ కాపురం పాడుచేసుకోవద్దు. కలకాలం పిల్లాపాపలతో వర్ధిల్లాలని ఆశీర్వదిస్తున్నాను. మీ అమ్మ ఇచ్చిన పొట్లంలో నీ భర్త నీకోసం పంపిన డబ్బుంది చూసుకో...

సదా నీ మంచి కోరే నీ తండ్రి

పరశురామయ్య.

భారగా నిట్టూరుస్తూ ఆ ఉత్తరాన్ని పర్సులో పెట్టుకుంది సుభద్ర.

ఒణికే చేతుల్తో అత్తవారింటి తలుపు తట్టింది సుభద్ర. చేతులు తుడుచుకుంటూ వచ్చి తలుపులు తెరిచిన సత్యాన్ని చూసి ఆమె మెదడు మొద్దుబారిపోయింది. ఇలా రాగానే ముందు అతని కళ్లపడవల్సి వస్తుందని ఊహించకపోవడంచేత తప్పుచేసినట్లు ఫీలవుతూ కళ్లువాల్చి గుమ్మం బయటే నిల్చుండిపోయింది.

భార్యని చూసిన సత్యం కళ్లు ఆశ్చర్యంతోపాటు ఆనందం కలిగి వెడల్పయ్యాయి. లోపలికి రావడానికి ధైర్యం చాలక అతనేమంటాడో, ముఖమ్మీదే దెప్పుతాడేమోనని ఆలోచిస్తూ సందిగ్ధంగా గుమ్మంలోనే నిలబడిపోయింది.

"అక్కడే ఆగిపోయావేం సుభా... ఇది నీ ఇల్లు కాదనిపించిందా?"

ఏం మాట్లాడాలన్నా, అసలేం చెప్పాలో తెలియడంలేదు సుభద్రకు. అతని గొంతులో అదే ఆప్యాయత. అదే ప్రేమ, ఆ పిలుపులో అదే మాధుర్యం, సుభద్ర మనసు ఉక్కిరి బిక్కిరై ఆనందంతో గుండెలు బరువెక్కుతుంటే అప్రయత్నంగా ఆమె కళ్లలో తడి.

అది గ్రహించిన సత్యం చనువుగా తనే భార్య చేయందుకుని లోపలికి లాగాడు. ఆ లాగడంలోని ఆత్రానికి సుభద్ర అతని యెదమీదకు వొరిగిపోగానే వెంటనే అతనిచేతులామెను ఆర్తిగా చుట్టేశాయి.

సుభద్ర కన్నీటితో అది ఎదంతా తడిసిపోతుంటే మెల్లగా అన్నది "నామీద కోపం లేదూ" అని.

"వుంది. నన్ను విడిచి వెళ్లావనీ, నా ఉత్తరానికి రిప్లై రాయలేదనీ... కానీ అన్నిటికీ సమాధానంగా నువ్వు వచ్చేశావుగా" భార్య

వెన్నుమీద నిమురుతూ అన్నాడు.

"ఒక్కసారి మీరయినా రాకూడదూ?"

"ఉహూ... నిన్ను విడిచి నేను వెళ్లలేదుగా... నన్ను విడిచి నీవే వెళ్లావు కాబట్టి నీవే రావాలనుకున్నాను."

"పెద్ద గొప్ప... అది సరేగానీ అత్తగారేరీ?"

తెలిసినవారింట్లో పెళ్లయితే వెళ్లింది. మనిద్దరికీ ఏకాంతం కల్పించాలనేమో... ప్రొద్దునే బయల్దేరినట్లున్నావు పద భోంచేద్దువుగాని. ఆమెనలాగే పొదివిపట్టుకుని వంటింట్లోకి తీసుకువెళ్లాడు సత్యం.

ఇద్దరికీ అతను పెట్టబోతుంటే తనే అందుకుని ఇద్దరికీ వడ్డించింది సుభద్ర. తొలిముద్ద నోటికందించి అతను తింటుంటే అతని హృదయంలో తన చోటలాగే వుందనిపించింది సుభద్రకి. ఎంతో రిలీఫ్ ఫీలయింది.

"మనసున మనసై బ్రతుకున బ్రతుకై
తోడొకరుండిన అదే భాగ్యమూ..."

చిన్నగా పాట వినిపిస్తుంటే తలెత్తి చూసేసరికి ఎదురుగా బుల్లి ట్రాన్సిస్టర్ కనిపించింది.

"అదెప్పుడు కొన్నారు"

"ఈ మధ్యనే బాగుందా"

"ఊ..."

"ముందు చిన్న వస్తువులు ఏర్పరచుకుని తరువాత పెద్దవి కొనుక్కుందాం సుభా... ఏమంటావు?"

"అబ్బ... బుజ్జిముండ ఎంత ముద్దొస్తోందో... మనసులో అనుకోబోయి పైకనేసింది ట్రాన్సిస్టర్ని చూస్తూ.

"అహా నీకంటేనా..." సత్యం కొంటెగా నవ్వుతుంటే సిగ్గు ముంచుకొచ్చేసి తలను వంచేసింది. అతనింకా అలాగే నవ్వుతూంటే ఆమె మనసంతా ప్రశాంతతతో నిండిపోగా అనురాగం నిండిన కళ్లతో తదేకంగా భర్తవైపే చూస్తుంటే అతనది గ్రహించినట్లుగా అమాంతం ఎత్తేసి గదిలోకి తీసుకెళ్లిపోయాడు అపురూపంగా. నిండు మనసులో భర్త ఎదలో ఆర్తిగా ఒదిగిపోయింది సుభద్ర

